

ఈ వారం కథ

# ఛార్జిషీటు

– డి.ఆర్. ఇంద్ర



హలో సార్! ఇటు...ఇటు...ఇక్కడ...ఈ మూల నుంచీ మాట్లాడుతున్నాను. నా గొంతు సరిగ్గా విని పించడం లేదంటారా? నిజమే. నా గొంతు సన్నగా పీలగా కీచుగా వుంది. మూత పెట్టిన గ్లాస్ బాక్సు లోని రసాయనిక ద్రవాల అడుగున చిన్న నలుసులా వుండి మాట్లాడుతున్నానుగదా. ఆ గ్లాస్ బాక్స్ మరొక ప్రత్యేకమైన కంటైనర్‌లో భద్రంగా వుంది. నన్నింత పక డ్బందీగా బంధించిన చోటు నుంచే మాట్లాడుతోంటే నా గొంతు నాకే వినిపించనంత బలహీనంగా వుండదా మరి? అయినా నే చెప్పేది దయచేసి వినండి సార్! నేను వున్న కంటైనర్ ఎక్కడుందీ అంటారా? నగ రంలో పేరుపొందిన డాక్టర్ సంతానంగారి 'ఫెర్టిలిటి క్లినిక్'లోని ఎ.సి. రూంలో సార్.



నా గొంతు బలహీనంగా ఉండటా నికి కారణం–నా గొంతుకా, నోరూ ఇంకా రూపుదిద్దుకోలేదు కదా, కేవలం హ్యూమన్ ఎంబ్రియోని. అవున్సార్. అచ్చ తెలుగులో రూపుదిద్దుకుంటున్న మానవ పిండాన్ని. మాతిలోని చేదని గాలం వేసి పైకి లాగినట్టు ఓ స్త్రీ పొత్తి కడుపులోకి సన్నని పరికరాన్ని దించి అండాశయంలోంచి వెలికి తీయబడ్డ గుడ్డుతో, ఛండాలమైన పద్ధతిలో వెలికి రప్పించబడ్డ ఏ మగాడిదో తెలియని వీర్య కణాన్ని, ప్రత్యేక వాతావరణంలో ఒక గాజు నాళికలో పొదిగించగా కొన్ని గంటల క్రితమే మానవ పిండంగా ఏర్ప డ్డదాన్ని. (వాణ్ణి?). నేను ఆడో–మగో ఇంకా నాకే తెలియదు సార్. మరికొన్ని గంటలసేపు కణ విభజన జరిగాకకానీ నా జెండర్ ఏమిటో నాకే తెలీని ఉభయ జెండర్‌ని. నా అవయవాలు ఏర్ప డటానికి కొన్ని రోజులు పడుతుంది. నా గుండె, మెదడు ఆలస్యంగా ఏర్పడ తాయి. నా గుండె, మెదడు ఇంకా ఏర్ప డకపోయినా–చిత్రం నాలో అనుభూ తులు, ఆలోచనలు మొదలయ్యాయి అప్పడే! యస్సార్...! అలా నిర్ఘాంత పోకండి. మానవ 'ప్రాణి'గా చెప్ప కోడానికి ఇంకా అవకాశంలేని సజీవ పదార్థ రూపంలోనే వున్నా, సెకను సెక నుకీ మిలియన్ల కొద్దీ పెరుగుతూన్న నా జీవాణువుల సామూహిక చైతన్యం అవుడే 'నేను'గా రూపుదిద్దుకుని, పెరగ డాన్ని అనుభూతి చెందుతూ, రేసియల్ మెమొరీ ద్వారా ఆలోచించగల్గుతు న్నాను సార్. ఇదంతా సైన్సే! కానీ ఇక్కడ సైన్సు కానిది చాలా వుంది సార్. అది చెప్పటానికే మిమ్మల్ని పిలిచాను. ఉరితీసే ముందు నేరస్తుడి

చివరి కోరిక వింటారట గదా. (ఎంత దయ!) ఇంకా ఏర్పడని నా చిట్టి చేతులు జోడించి, రూపు దిద్దుకోని నా లేత పెదవులు విప్పి నా కోరిక (మొదటిదో చివరిదో నాకే తెలియదు) వినమని ఏ నేరమూ చెయ్యని నేను వేడుకుంటున్నాను.

లోకంలో మనుషులందరూ సహజమైన స్త్రీ పురుష సంయోగ ఫలితంగా, ఆ మాధుర్యపు తీపి గుర్తులుగా పుడతారు. అందుకే తల్లిదండ్రులకి పిల్లలపై ప్రేమ వుంటుంది సహజంగా. కానీ నా పుట్టుక అటువంటిది కాదు. నా తండ్రెవరో నాకే కాదు, నా తల్లికీ తెలియదు. స్పెర్మ్ బాంక్ నుంచి కొని తెచ్చిన ఆ వీర్యం (కిరాణా కొట్లో కిరసనాయిలు కొన్నట్టు) ఏ పిచ్చి మేధావిదో, రోజూ పెళ్ళాన్ని చావగొట్టి చెవులు మూసే ఏ ఆదర్శ పురుషుడిదో, తన వీర్యాన్ని తనే అమ్ముకునే ఏ గొప్ప డాక్టర్‌దో, లేక తన ఫీజు అందితే నిర్వికారంగా హత్యలుచేసే ఏ ప్రొఫెషనల్ మర్డరర్‌దో తెలియదు. ఇంక నా తల్లి అంటారా? ఎవరు నా తల్లి? డబ్బు కోసం తన అండాశయంలోంచి ఓ అండాన్ని అమ్ముకున్న (గంపనిండా కోడిగుడ్లు పెట్టి అమ్ముకున్నట్టు) ఆడదా? లేక ఆడజన్మ ఎత్తినందుకు తప్పనిసరిగా పిల్లల్ని కని మాతృదేవత అనిపించుకోవడమే జీవిత పరమావధిగా భావించి, నీతి నియమాలు, నైతిక విలువలు, సిగ్గెగ్గులూ వదిలేసి, ముక్కూ ముఖం తెలియని పరాయి పురుషుడి వీర్యంతో డబ్బు కోసం అమ్ముకున్న అండంతో పొదగబడ్డ పిండాన్ని ఫెర్టిలిటీక్లినిక్‌లో తనలో ప్రవేశ పెట్టుకోబోతున్న ఆడదా? ఎవరు సార్ నా తల్లి? విక్రమార్కుడి కథలోని ప్రశ్నలా వుందా నా ధర్మ సందేహం?

నా తండ్రెవరు? చేతి వాచినో, సైకిల్‌నో అవసరార్థం (తాగుడుకో, పేకాటకో) అమ్ముకున్నట్టు- డబ్బు అవసరమైనపుడు రక్తాన్ని అమ్ముకున్నట్టు తన వీర్యాన్ని అమ్ముకున్న ఆ మగ పశువా? లేక తన అపారమైన ఆస్తికి వారసుడు కావాలనే తపనతో ఉచ్చ నీచాలు మరచి ఈ జుగుప్సాకరమైన పద్ధతికి ఒడబడిన నా అమ్మ (?)




బలభద్రపాత్రుని రమణి

కొత్త సీరియల్ త్వరలో

మొగుడా? నా బయలాజికల్ మదర్ ఎవరు? డబ్బు కోసం దేహాన్ని అమ్ముకున్నట్టే-తన శరీరంలోంచి చిన్న సూది తలంత అండాన్ని అమ్ముకుని ఎన్నడూ నా ముఖం చూడని ఆ దౌర్భాగ్యపు ఆడదా? తనది కాని పిండాన్ని తన శరీర ద్రవాలతో తను పీల్చిన గాలితో నన్ను పెంచి ఈ లోకంలోకి తీసుకు వచ్చిన ఆడదా? ఎవరిని అమ్మ అనాలి? ఎవరిని తండ్రి అనాలి? నా శరీరంలోని రక్తం ఎవరిది? నా కళ్ళు, నా ముక్కు, నా లక్కపిడత నోరు ఎవరివి? ఎవరి పోలిక నేను? నీ తల్లిదండ్రులెవరని అడిగితే నేనేమని చెప్పాలి?

వేరు వేరు మొక్కల్ని అంటుకట్టినట్టు, కృత్రిమ గర్భోత్పత్తి పద్ధతుల ద్వారా కొత్తరకం సంకరజాతి పశువులని ఉత్పత్తి చేసినట్టు-మానవతా నైతిక విలువల్ని మంటకలిపి వికృత అసహజ పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేయబడ్డ నాలాటి నికృష్టపు శిశువు తన తల్లిదండ్రులు ఎవరని చెప్పుకోవాలి సార్? నేనెవరికి పుట్టిన బిడ్డని? (అని వెక్కి వెక్కి ఏడ్చి ఎక్కిళ్ళు వస్తున్నాయి సార్!)

మనిషిగా నా అస్తిత్వాన్ని, నా వ్యక్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కించపరచేలా-లేబరేటరీలలో పరిశోధనలలో ఉపయోగించే గినియా పందుల స్థాయిని నన్ను-మానవ ప్రాణిని దిగజార్చే హక్కు ఈ డాక్టర్లకి ఈ తల్లిదండ్రులకి ఎవరిచ్చారు? ఎవరిని అడిగి నన్ను పుట్టించారు?

గుప్పెడు మెతుకుల కోసం పారేసిన ఎంగిలి విస్తరాకుల దగ్గర హీనాతిహీనంగా కుక్కల్లా కొట్టుకునే లక్షలాది అనాథ పిల్లలున్న దేశంలో స్వంత బిడ్డకోసం వేలు, లక్షలు ఖర్చుపెట్టి జుగుప్సాకరమైన పశు పద్ధతిలో పిల్లల్ని కనడానికి సిద్ధపడ్డ ఆడదాన్ని అమ్మా అని ఎలా పిలవను? గుప్పెడన్నం పెట్టమని దీనంగా గేటు దగ్గర నిలబడి ప్రార్థించే అనాథ పిల్లల్ని పొమ్మని కసురుతూ నాకు వెండి గిన్నెలో మీగడ పెరుగులు తినిపించే ఆడదాన్ని తల్లి అని ఎలా అనను? అరచేయంత గోచీకి కూడా నోచుకోని చింపిరితలల పిల్లలు పది పైసలు అడుక్కోడానికి చుట్టూ మూగితే, చీదరించుకుంటూ కారు దిగి నా కోసం రెడీమేడ్ షాపంతా కొనేసే ఆడదాన్ని అమ్మా అని ఎలా పిలవను? వాళ్ళూ నాలాంటి వాళ్ళు కాదా? పిల్లల మీద ప్రేమే నిజమైతే నైతిక విరుద్ధమైన నాలాటి శిశువులకి జన్మనివ్వడం కన్నా ఏ అనాథ శిశువునో తెచ్చి పెంచుకోవడం గొప్ప విషయం కాదా? అమ్మ, ఆకలి అనే మాటలకి అర్థమే తెలిసిన మనుషులున్న దేశమైతే ఈ దేశంలో అనాథ శిశువు ఒక్కడైనా వుంటాడా చెప్పండి సార్?

ఆడది స్వయంగా కంటేనే తల్లా? పితృత్వం పురుష జన్మకి పరమావధి కానపుడు ఆడజన్మకి మాతృత్వం పరమావధి ఎట్లా అయింది? పితృత్వమూ మాతృత్వమూ సమానమైనవి కాదా? ఆడది మాతృత్వం కోసం తహతహలాడినట్లు పితృత్వం కోసం తహతహలాడే మగాడిని ఎవరైనా ఎప్పుడైనా ఎక్కడైనా చూసారా? (మగతనం నిరూపించుకోడానికి తహతహ లాడటం తప్ప!) మాతృత్వం పేరిట పిల్లల కోసం పరితపించడం అనే స్త్రీలకు మాత్రమే సోకే అంటు జబ్బు మగాడు ఆడదానికి చేసిన బ్రెయిన్ వాష్‌వల్ల పట్టుకున్నది కాదా? తన అవసరం తీర్చుకుని దులుపుకు చక్కాపోతూ ఆడదాన్ని మాతృత్వం అనే వలలో చిక్కిన పావురంలా చెయ్యడం ఒక పెద్ద కుట్ర, దగా, మోసం కాదా చెప్పండి సార్! ప్రపంచంలోని అన్ని కుట్రలకన్నా ఇది పెద్ద కుట్ర కాదా?

పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనడమే నీ బతుక్కి చరితార్థం అని ఆడదాని చెవుల్లో పొగబెట్టి ఊదరగొట్టి బుర్ర తినేసి నమ్మించి మాతృత్వం అనే గిల్టు వడ్డాణాన్ని స్త్రీ నడుముకి మేకులతో దిగ్గొట్టి పిల్లలకోడిలా తయారు చేసి చాటుగా నవ్వుకునే ఈ కుచ్చితపు మొగ పశువుల మీద కుట్ర, దగా ఆరోపణలమీద చార్జిషీటు దఖలు చెయ్యాలని నా కోరిక సార్. ఈ దేశంలో ఏ పోలీసూ నా ఎఫ్.ఐ.ఆర్. తీసుకోడు అంటారా? పోలీసు స్టేషన్‌కి వెడితే ఆడోమగో ఇంకా తేలని నన్ను మానవ పిండాన్ని కూడా రేప్ చేసే వ్యవస్థలో నా ఎఫ్.ఐ.ఆర్. చెల్లదంటారా? చిన్న నలుసునని మరీ అంత డిస్కరేజ్ చెయ్యకండి సార్.

ఉన్న పిల్లలకే తిండి పెట్టలేని సమా

20-8-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

జంలో ఫెర్టిలిటీ క్లినిక్కులు పెట్టి ఎవరివల్ల ఎవరికి పుట్టిన బిడ్డో తెలియని నీచమైన పద్ధతులలో నన్ను పుట్టించి అవమానించినందుకు ఈ కుష్టు వ్యవస్థని బాధ్యతా రాహిత్యం నేరంపై శిక్షించమని ఏ న్యాయస్థానాన్ని వేడుకోవాలో చెప్పండి సార్. సామాజిక స్పృహనీ, సిగ్గెగ్గుల్నీ గాలికి వదిలేసి, వికృతమైన బొజ్జల్ని ఆడించుకుంటూ, వంద కోట్లకి జనాభా చేరుకున్న దేశంలో ఫెర్టిలిటి క్లినిక్కుల ప్రారంభోత్సవాలకి తయారయ్యే రాజకీయ కీచక నాయాళ్ళపై ప్రజల ఖర్చుతో డాక్టర్లై, ఆడవాళ్ళలో మాతృత్వపు పిచ్చిని తమ ప్రకటనల ద్వారా రెచ్చగొట్టి పెంచి పోషిస్తూ, ఫెర్టిలిటీ క్లినిక్కులని నడుపుతూ దోచుకుంటూ సామాజిక నేరానికి పాల్పడే డాక్టర్లూ, స్పెషలిస్టులపై దేశద్రోహ నేరంపై శిక్షించమని ఏ అత్యున్నత న్యాయస్థానంలో వేడుకోవాలో చెప్పండి సార్! చెప్పండి.

మహోన్నతమైన ఆధ్యాత్మిక విలువలకీ, శాంతికీ, ప్రేమకీ ప్రపంచానికీ వెలుగు చూపే దేశమని గుండెలు బాదుకునే ఈ దేశంలో ఇన్ని లక్షల మంది అనాథ శిశువులు ఎక్కడినుండి వచ్చారని మతప్రబోధకులనీ, వాళ్ళ వెనక తోకాడించుకుంటూ కుక్కల్లా తిరిగే పెద్దలనీ నిలదీసి అడగాలని నా కోరిక సార్.

నా కోరికలు గొంతెమ్మ కోరికలా? ఆచరణ సాధ్యం కానివా? చెప్పండి సార్. ఇలా కోరడమే నేరమైతే నా నేరానికి నన్ను ఉరి తీయండి సార్. నా ఆఖరి కోరిక ఏమిటంటారా? అర్థంలేని మాతృత్వపు పిచ్చిని రెచ్చగొట్టే ఫెర్టిలిటీ క్లినిక్కుల్ని మూయించండి. మితిమీరిన దేశ జనాభా ప్రమాద దృష్ట్యా అది ముఖ్యం కూడా. నైతిక విలువలకి విరుద్ధంగా మనుషుల్ని పశువుల స్థాయికి దిగజార్చే ప్రయోగాలనూ, వికృత శిశుజననాలనీ ఆపండి. ఇదే నా చివరి కోరిక. ఈ కుష్టు వ్యవస్థలో నా చివరి కోరికను కూడా తీర్చలేరా? వాలాటి తిరుగుబాటుదారుల్ని ఎలాగూ ఉరేసి చంపుతారుగా. ఆఖర్న చిన్న కోరిక సార్. నా తల్లి పేగుతోనే నన్ను ఉరితీయండి సార్. ప్లీజ్ హేంగ్ మి క్విక్.

# చరిత్రలో మీ పుట్టిన రోజు/పెళ్ళిరోజు




నేను పుట్టింది 30-8-75 తేదీన. ఆ సంవత్సరం అదే రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి కావడం విశేషం.

– నందం విష్ణువర్థన్,
రైల్వేస్టేషన్ రోడ్డు,
పిడుగురాళ్ళ – 522 413
గుంటూరు జిల్లా

నా పుట్టినరోజు అట్లాంటి ఇట్లాంటిది కాదండోయ్! ఎన్నో విశేషాలు పెనవేసుకుని వున్న విశిష్టమైన రోజు. జనవరి 26.

నేను 26-01-1970లో జన్మించాను. పుట్టిన చోటు సూర్యాపేట. జనవరి 26 మన గణతంత్ర దినోత్సవం అని అందరికీ తెలుసు. అయితే ఎక్కువ మందికి తెలియని విశేషాలు: భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించింది జనవరి 26న (సం. 1885.). మన దేశంలో మొట్టమొదటిసారిగా టెలిగ్రాఫ్ ద్వారా వార్తలు పంపిన రోజు కూడా అదే. తొలిగా మన దేశంలో కూ ఛుక్ ఛుక్ అంటూ పొగబండి తిరిగిన



రోజు కూడా అదే (సం. 1853.). అంత గొప్ప రోజున నేను పుట్టాను.

– ఎం.రాజశేఖర్,
ఇంటి నెం: 3-10-41/1,
రామా రైస్ మిల్ దగ్గర,
సూర్యాపేట
నల్లగొండ

నా పుట్టిన రోజు ఆగస్టు 15, 1954. ఆ రోజు భారత స్వాతంత్ర్యదినోత్సవం. ఊరి పిల్లలు ఆనందంతో జెండాలు పట్టుకుని వెడుతుంటే నేను కొత్త చీరతో ముస్తాబై గుడికి వెళ్ళాను. అలాంటిదే మరో సంబరం – అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున మా పెళ్ళిరోజు.

నేను ఆ రోజు పుట్టిన రోజు అని, ఈ రోజు పెళ్ళి రోజు అని ఎంత ఆనందం పొందుతానో చెప్పలేను.



– పుట్టినరోజున
జి. ఇందిరా దేవి
– పెళ్ళిరోజున
ఎం. ఇందిరారావు



నా పుట్టిన రోజు ఫిబ్రవరి 6. సుప్రసిద్ధ ఆంగ్ల నటుడు హెన్రీ ఇర్వింగ్ జన్మదినం కూడా ఫిబ్రవరి 6.

– విక్కీ....
క్వార్టర్ నెం: బి–72,
ఎల్.ఎం.డి. కాలనీ
కరీంనగర్ జిల్లా

మా పెళ్ళి రోజు మార్చి 27. పులిపాటి దుర్గారావు, కనకదుర్గ. ఎంకిపాటల నండూరి జన్మించిన తేదీ అది.

2. నా పుట్టిన రోజు అక్టోబర్ 5. పులిపాటి దుర్గారావు. మొదటిసారిగా ఇంగ్లీషులో బైబిల్‌ను ఆ రోజు ముద్రించారు.

3. నా పుట్టిన రోజు మే 25 - పులిపాటి కనకదుర్గ. జాతీయోద్యమ కార్యకర్త, రాయలసీమ రాజకీయ పితామహులు కల్లూరు సుబ్బారావు ఆ రోజు పుట్టారు.

– పులిపాక కనకదుర్గ
పులిపాటి దుర్గారావు
పి.ఆర్.కె. బిల్డింగ్,
భవానీపురం, విజయవాడ-12



## చరిత్రలో మీ పుట్టిన రోజు/ పెళ్ళిరోజు
### గమనిక

ఈ శీర్షికలో పాల్గొనదలచినవారు ఉత్సాహవంతులైన పాఠకులు తమ జనన/వివాహ తేదీని పేర్కొంటూ ఫోటో పంపితే చాలు. ఆ తేదీకి ఇతరత్రావున్న ప్రాధాన్యం తమకు తెలిస్తే వివరించవచ్చు. అలా వివరించని ఎంట్రీలకు తగిన అదనపు సమాచారం సంపాదకవర్గం జోడించి ప్రచురిస్తుందని గమనించమనవి.

ప్రతి ఎంట్రీతో ఫోటో విధిగా జత పరచవలసి వుంటుంది.

– ఎడిటర్